కాళేశ్వరం ఆలయంలో ఉసిరి చెట్టు వద్ద పూజలు చేస్తున్న భక్తులు(ఫైల్)

పరమ పవిత్రం... కార్తీక మాసం..

- నేటి నుంచి కార్తీక మాసం ప్రారంభం
- ముస్తాబైన రామప్ప, కాళేశ్వరం, కోటగుళ్లు
- ఏర్పాట్లు చేసిన అధికారులు

వెంకటాపూర్/కాళేశ్వరం/గణపురం, నవంబర్ 1 : కార్తీక మాసోత్సవాలకు ములుగులోని రామప్ప ఆలయం, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం, కోటగుళ్లు ఆలయాలు ముస్తాబయ్యాయి. నవంబర్ 2 నుంచి డిసెంబర్ 1వ తేదీ వరకు నెల రోజులపాటు ఆయా ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఈ మేరకు ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

కాళేశ్వరంలో ప్రత్యేక పూజలు ..

ప్రముఖ శైవ క్షేత్రం శ్రీ కాళేశ్వర ముక్తీశ్వరస్వామి వారి సన్నిధిలో కార్తీక మాసం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఆలయంలో లక్షపత్రి పూజలు, లక్ష దీపాలు వెలుగించుట, ఆదిముక్తీశ్వరస్వామి ఆలయం వద్ద ఉసిరి చెట్టుకు ప్రత్యేక పూజలు చేయనున్నారు. ఆలయానికి సమీపంలో గల గోదావరి త్రివేణి సంగమంలో కార్తీక పుణ్యస్నానాలు ఆచరించి కార్తీక పూజలు, సైకత లింగాలను పూజించి, లక్ష దీపాల వత్తులను ముట్టించి వదులుతారు.

కోటి సోమవారం..

కార్తీక మాసం సందర్భంగా కాళేశ్వరంలో ప్రత్యేక పూజలు చేయనున్నారు. కార్తీక మాసం శ్రవణ నక్షత్రం రోజును కోటి సోమవారం అంటారు. ఈ రోజు చేసే శివపూజ కోటి సోమవారాలలో చేసిన ఫలాన్ని అందిస్తుందని ప్రతీతి. ఈ నెల 04,11,18,25వ తేదీ, పౌర్ణమి రోజు 15న సాయంత్రం 6 గంటలకు కాళేశ్వరం గోదావరి నదీ మాతకు హారతి, ఆలయంలో సామూహిక సహస్ర దీపాలంకరణ సేవ నిర్వహించనున్నట్లు అధికారులు, అర్చకులు తెలిపారు.

కోటగుళ్లలో కార్తీకమాసోత్సవాలు

గణపురం మండల కేంద్రంలోని కాకతీయుల కళాక్షేత్రం కోటగుళ్లలో నవంబర్ 2నుంచి డిసెంబర్ 1వ తేదీ వరకు నెల రోజులపాటు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. నెల రోజుల కార్యక్రమాల్లో భాగంగా కార్తీక వనభోజనాలు, గోమాతలకు పూజలు, సత్యనారాయణ వ్రతాలతోపాటు నవంబర్ 15న కార్తీకదీపం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కోటగుళ్ల పరిరక్షణ కమిటీ వెల్లడించింది. సుమారు 10వేల మట్టి ప్రమిదలతో ఆలయాన్ని అలంకరించనున్నట్లు వారు తెలిపారు. ప్రతి సోమ, శుక్రవారాలలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించనున్నామన్నారు. పూజా కార్యక్రమాల్లో భాగంగా దీపోత్సవానికి నూనె అందించే భక్తులు ఆలయ అర్చకులను సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు. దీపోత్సవానికి నూనె అందించే భక్తుల నామ గోత్రాలపై ప్రతిరోజూ సాయంత్రం పూజ చేయనున్నట్లు వారు తెలిపారు.

నేటి నుంచి రామప్పలో పూజలు..

నేటి నుంచి డిసెంబర్ 1వ తేదీ వరకు నెల రోజులపాటు రామప్పలో కార్తీక మాసంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో శ్రీనివాస్, అర్చకులు హరీశ్‌శర్మ, ఉమాశంకర్ తెలిపారు. రూ.1116 చెల్లించిన వారి పేర నెల రోజులపాటు అభిషేకాలు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.

మహనీయుడు వల్లభాయ్ పటేల్

- కలెక్టరేట్ ఏవో ఖాజా మొహినుద్దీన్
- ఘనంగా జాతీయ సమైక్యతా దినోత్సవం

ప్రతిజ్ఞ చేస్తున్న ఏవో ఖాజా మోహినుద్దీన్, అధికారులు

కృష్ణ కాలనీ, నవంబర్ 1 : భారతదేశ ఐక్యతకు, సార్వభౌమత్వానికి కట్టుబడిన మహనీయుడు సర్దార్ వల్లభాయ్ పటేల్ అని జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టరేట్ కార్యాలయ ఏవో ఖాజా మొహినుద్దీన్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేడుకలకు ఏవో ఖాజా మొహినుద్దీన్ ముఖ్యఅతిథిగా హాజరై సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఏవో మాట్లాడుతూ సర్దార్ వల్ల బాయ్ పటేల్ జయంతిని రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రీయ ఏక్తా దివస్ (జాతీయ ఐక్యత దినోత్సవం) వేడుకలుగా నిర్వహించాలని ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. దేశ ఐక్యతకు, సార్వభౌమత్వానికి కట్టుబడిన వ్యక్తి వల్లభాయ్ పటేల్ అని ఆయన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది దేశ ఐక్యత, సార్వభౌమత్వానికి కట్టుబడి ఉండాలని ప్రతిజ్ఞ చేయించారు. వివిధశాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మొగుళ్లపల్లిలో..

మొగుళ్లపల్లి : కుల, మత, వర్గ, లింగ బేదాలు లేకుండా ప్రజలు ఐక్యతతో జాతీయ సమైక్యతలో భాగస్వామ్యం కావాలని ఎస్సై బీ అశోక్ అన్నారు. ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్‌పటేల్ జయంతి సందర్భంగా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గురువారం రాష్ట్రీయ ఏక్తా దివస్ నిర్వహించి, జాతీయ సమైక్యత ప్రతిజ్ఞ చేయించారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గోవిందరావుపేటలో..

గోవిందరావుపేట : చల్వాయిలోని తెలంగాణ స్పెషల్ పోలీస్ 5వ బెటాలియన్‌లో రాష్ట్ర ఏక్తా దివాస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. బెటాలియన్ కమాండెంట్ టీ అలెక్స సర్దార్ వల్లబాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సిబ్బందితో జాతీయ సమైక్యత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ ఎన్ పెద్దబాబు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు కార్తీక్, సాల్మన్‌రాజ్, శ్రీనివాసులు, అన్నయ్య, రాంప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

రామప్పలో భక్తుల సందడి

గోముఖిని అందిస్తున్న లక్ష్మి-ఏడుకొండలు దంపతులు

వెంకటాపూర్, నవంబర్ 1 : రామప్ప దేవాలయం దీపావళి సందర్భంగా గురు, శుక్రవారాల్లో పర్యాటకులతో సందడిగా మారింది. తెలుగు రాష్ట్రాలతోపాటు రాజస్థాన్, కేరళ, మహారాష్ట్ర, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ తదితర రాష్ట్రాల నుంచి పర్యాటకులు, పలువురు అధికారులు, రాజకీయ నాయకులు సందర్శించారు. ఆలయ అర్చకులు హరీశ్‌శర్మ, ఉమాశంకర్ పూజలు చేసి వారికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ చరిత్ర, శిల్పకళ విశేషాలను టూరిజం గైడ్స్ ద్వారా తెలుసుకుని ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం రామప్ప చెరువును సందర్శించి బోటింగ్ చేస్తూ ఆహ్లాదంగా గడిపారు. శ్రీరామలింగేశ్వర స్వామి అలంకరణ నిమిత్తం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కృష్ణా జిల్లా కానూరు గ్రామానికి చెందిన కోనేటి లక్ష్మి-ఏడుకొండలు దంపతులు రూ.5వేల విలువైన గోముఖిని బహూకరించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552
HANAMKONDA 9182777563 9182777961
WARANGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565

జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో పటాకులు కాలుస్తున్న ప్రజలు

భక్తి శ్రద్ధలతో దీపావళి

- ఊరూరా ఘనంగా వేడుకలు
- లక్ష్మీ, కేదారేశ్వర వ్రతాలు ఆచరించిన ప్రజలు
- పటాకుల మోతతో దద్దరిల్లిన గ్రామాలు

కాళేశ్వరంలో కేదారేశ్వరస్వామి వ్రతం చేస్తున్న భక్తులు

కృష్ణకాలనీ/ కాళేశ్వరం/ చిట్యాల/ మల్హర్/ కాటారం/ గోవిందరావుపేట/ ఏటూరునాగారం, నవంబర్ 1 : దీపావళి పర్వదిన వేడుకలను శుక్రవారం ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. గురువారం లక్ష్మీపూజలు, శుక్రవారం కేదారేశ్వరస్వామి వ్రతాన్ని భక్తి శ్రద్ధలతో ఆచరించారు. ఇళ్లను మామిడి తోరణాలు, పూలతో అలంకరించారు. సాయంత్రం వాకిళ్ల ముందు అందమైన ముగ్గులు వేసి ప్రమిదలు వెలిగించారు. రంగురంగుల క్రాకర్లు, పటాకులు కాలుస్తూ ఉల్లాసంగా గడిపారు. కొనుగోలుదారులతో పటాకుల దుకాణాలు సందడిగా మారాయి. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిర్వహించే ఈ వేడుకల్లో చిన్నాపెద్దా తేడా లేకుండా పాల్గొని సందడి చేశారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని ఆలయాల్లో విశేషపూజలు చేశారు. కుటుంబ సభ్యులతో గ్రామస్తులు తరలివెళ్లి దర్శించుకున్నారు.

కాటారం : పటాకులు కాలుస్తున్న యువతులు

కాటారం:కేదారేశ్వర పూజ

గోవిందరావుపేట : చల్వాయిలో..

గోవిందరావుపేట : పటాకుల దుకాణాల వద్ద సందడి

కృష్ణకాలనీ : బుద్ధునికి పూజలు చేస్తున్న బౌద్ధ మహాసభ నాయకులు

భూపాలపల్లి భగత్‌సింగ్ కాలనీలో..

చిట్యాలలో ప్రమిదలు వెలిగిస్తున్న మహిళ

భూపాలపల్లిలో క్రాకర్స్ కాలుస్తున్న ఓ కుటుంబం

మావోయిస్టు లేఖలో అసత్య ఆరోపణలు

కాళేశ్వరం,(మహదేవపూర్)/మహముత్తారం, నవంబర్ 1 : మావోయిస్టు రాష్ట్ర కమిటీ పేరిట విడుదలైన లేఖలో తనపై చేసిన అసత్య ఆరోపణలను ఖండిస్తున్నానని మహదేవపూర్ మాజీ సర్పంచ్ శ్రీపతిబాపు, మహముత్తారం మాజీ జడ్పీటీసీ మందల రాజిరెడ్డి అన్నారు. దళిత బంధు పథకం పేరుతో ఏ ఒక్కరి దగ్గరి నుండైనా డబ్బులు వసూలు చేసినట్లు నిరూపిస్తే ప్రజాక్షేత్రంలో ఎలాంటి శిక్షకైనా తను సిద్ధంగా ఉంటామని అన్నారు. కష్టపడిపైకి వచ్చిన వాళ్లమని, ప్రజాసమస్యలపై నిరంతరంగా పోరాడే స్వభావం, ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ ప్రజాసేవలో రాణిస్తున్నామని అన్నారు.

విశ్రాంతి భవనాన్ని ప్రారంభించిన ఎస్పీ

విశ్రాంతి భవనాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ

ములుగురూరల్, నవంబర్ 1 : ములుగు జిల్లా పోలీస్ కార్యాలయ ప్రాంగణంలో జిల్లా ఎస్పీ డాక్టర్ పీ శబరీష్ పునఃనిర్మించిన నూతన విశ్రాంతి భవనాన్ని శుక్రవారం పోలీస్ అధికారులతో కలిసి ప్రారంభించారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లా, ఇతర జిల్లాల నుంచి వచ్చే పోలీసు అధికారులకు సరిపడా విశ్రాంతి గదులు లేకపోవడంతోపాటు మేడారం జాతర, ఇతర ముఖ్య సమావేశాల సమయాల్లో ఉపయోగపడేందుకు నిర్మించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ సదానందం, డీసీఆర్బీ డీఎస్పీ రాములు, సీఐలు శంకర్, రవీందర్, శ్రీనివాస్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు సంతోష్, వెంకటనారాయణ, ములుగు, పస్రా, తాడ్వాయి, ఏటూరునాగారం, మంగపేట ఎస్సైలు వెంకటేశ్వర్‌రావు, కమలాకర్, శ్రీకాంత్‌రెడ్డి, తాజుద్దీన్, టీ.వీ.ఆర్. సూరి, ఆర్ఎస్ఐలు, సిబ్బంది ఉన్నారు.

నూతన డీఎంహెచ్‌వో గోపాల్‌రావును సన్మానిస్తున్న అప్పయ్య, వైద్యులు

విధుల్లో చేరిన నూతన డీఎంహెచ్‌వో

ములుగురూరల్, నవంబర్ 1 : ములుగు జిల్లా నూతన డీఎంహెచ్‌వోగా డాక్టర్ గోపాల్‌రావు శుక్రవారం విధుల్లో చేరారు. ఈ మేరకు ఆయనను ములుగు నుంచి బదిలీ అయిన డీఎంహెచ్‌వో అల్లెం అప్పయ్యతో పాటు డిప్యూటీ డీఎంహెచ్‌వో విపిన్‌కుమార్, వైద్యులు, సిబ్బంది కలిసి శాలువాలతో సత్కరించారు. జిల్లాలో 70 శాతానికి పైగా గిరిజనులే ఉన్నందున వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని గోపాల్‌రావు సూచించారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్లు, కార్యాలయ సిబ్బంది, హెచ్‌సీ వైద్యులు, ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ వైద్యులు, ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రామ్ డాక్టర్లు, డెమో, ఏఎంవో, సబ్‌యూనిట్ ఆఫీసర్లు, సూపర్‌వైజర్లు, ఫార్మసిస్టులు, సిబ్బంది పాల్గొన్నారు.

సింగరేణి భూపాలపల్లి ఏరియా జీఎం బదిలీ

కృష్ణ కాలనీ, నవంబర్ 1: సింగరేణి భూపాలపల్లి ఏరియా జనరల్ మేనేజర్‌గా విధులు నిర్వర్తిస్తున్న హబీబ్ హుస్సేన్‌ను బదిలీ చేస్తూ సింగరేణి యాజమాన్యం శుక్రవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన స్థానంలో మణుగూరు ఏరియా ఎస్ఓటు జీఎంగా విధులు నిర్వర్తిస్తున్న ఏనుగు రాజేశ్వర్‌రెడ్డిని భూపాలపల్లి ఏరియా జీఎంగా బదిలీ చేశారు. హబీబ్ హుస్సేన్ ఎనిమిది నెలల క్రితం సింగరేణి భూపాలపల్లి ఏరియా జనరల్ మేనేజర్‌గా బాధ్యతలు చేపట్టి అనతి కాలంలోనే బదిలీ అయ్యారు.

భారీ వర్షం

ఏటూరునాగారం/ కన్నాయిగూడెం, నవంబర్ 1 : మండలంలో రెండు రోజులపాటు కురిసిన భారీ వర్షానికి మిర్చి రైతులతోపాటు పటాకుల వ్యాపారులు ఆందోళనకు గురయ్యారు. శుక్రవారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. సాయంత్రం వరకు తెరపి ఇవ్వడంతో కొంత ఊపిరి పీల్చుకున్నారు. అకాల వర్షంతో మిర్చి రైతులు, వరి రైతులు కొంత ఇబ్బందులకు గురయ్యారు. పండుగ సమయంలో వర్షాలు రావడంతో నష్టం వాటిలినట్లు పటాకుల వ్యాపారులు తెలిపారు.

ఇద్దరు మావోయిస్టుల అరెస్టు

వివరాలు వెల్లడించిన ఎస్పీ

మావోయిస్టుల అరెస్టు చూపుతున్న పోలీసులు

ములుగు, నవంబర్1(నమస్తేతెలంగాణ) : మంగపేట మండలం బ్రాహ్మణపల్లి ఫారెస్టు చెక్‌పోస్టు వద్ద అక్టోబర్ 31న ఇద్దరు మావోయిస్టులను పట్టుకున్నట్లు జిల్లా ఎస్పీ డాక్టర్ పీ శబరీష్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ నిషేధిత మావోయిస్టు పార్టీకి చెందిన సభ్యురాలు, కొరియర్ మణుగూరు నుంచి ఏటూరునాగారం వైపు వస్తున్నారని నమ్మదగిన సమాచారం అందిందన్నారు. దీంతో మంగపేట ఎస్సై టీ.వీ.ఆర్. సూరి సిబ్బంది, బాంబు స్క్వాడ్, క్లూస్‌టీమ్‌లతో భద్రాచలం-ఏటూరునాగారం మధ్యలో గల బ్రాహ్మణపల్లి ఫారెస్టు చెక్‌పోస్టు వద్ద తనిఖీ చేపట్టినట్లు ఆయన తెలిపారు. ఈ తనిఖీల్లో వారి వద్ద ఉన్న సంచిలో పేలుడు సామగ్రి, విప్లవ సాహిత్యాలు కనిపించగా వారిని విచారించినట్లు తెలిపారు. పట్టుబడిన వారిలో మావోయిస్టు సభ్యురాలు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుకుమా జిల్లా మద్దూరు దులేడ్ గ్రామానికి చెందిన కడతి కమల అలియాస్ లక్ష్మీ, అదే రాష్ట్రం బీజాపూర్ జిల్లాకు చెందిన బేతల్పర కోటగూడా గ్రామానికి చెందిన కొరియర్ వోయం మంగు ఉన్నట్లు గుర్తించామన్నారు. పార్టీ అగ్ర నాయకులైన బడే చొక్కారావు అలియాస్ దామోదర్, కంకనాల రాజిరెడ్డి అలియాస్ వెంకన్న ఆదేశాల మేరకు కడతి కమలను దవాఖానకు తీసుకెళ్లి, చికిత్స అనంతరం మావోయిస్టు పార్టీకి కావాల్సిన వస్తువులు తీసుకొని బీజాపూర్ రావాల్సిందిగా ఆదేశాలున్నాయని తెలిపారు. దానిలో భాగంగా భద్రాచలంలోని శ్రీ శ్రీనివాస నర్సింగ్ హోంలో చికిత్స అనంతరం తిరిగి వెళ్లే క్రమంలో ఆటోలో బ్రాహ్మణపల్లి చెక్‌పోస్టు వద్ద దిగారని తెలిపారు. అక్కడి నుంచి ఏటూరునాగారం మీదుగా బీజాపూర్ వెళ్లే క్రమంలో ఉదయం 7గంటలకు పోలీసులు పట్టుకున్నారని తెలిపారు. ఇద్దరిని అరెస్టు చేసి వారి నుంచి రెండు డిటోనేటర్లు, ఐదు మీటర్ల కార్డెక్స్‌వైర్, ఐదు జిలెటిన్ స్టిక్స్, ఆరు పెద్ద బ్యాటరీ సెల్స్, రెండు పెన్‌డ్రైవ్‌లు, ఒకటి విప్ల సాహిత్యం, ఒక స్మార్ట్ ఫోన్, 32జీబీ మెమోరీ కార్డు స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ పేర్కొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

గోవిందరావుపేట/తాడ్వాయి, నవంబర్ 1 : గోవిందరావుపేట మండలంలోని కర్లపల్లి ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం పీ గంగు తెలిపారు. ఏటూరునాగారంలో గత నెల 29, 30తేదీల్లో నిర్వహించిన జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు ఆయన తెలిపారు. ఊట్నూర్‌లో ఈ నెల 4,5వ తేదీల్లో జరిగే పోటీల్లో వారు పాల్గొంటారని తెలిపారు. క్రీడారంగంలో జిల్లా స్థాయి అండర్-15లో విజేత ఎం జోగా, కబడ్డీ అండర్-14లో తాటి విష్ణు, పూజిం రాంచరణ్, వాలీబాల్ అండర్-17లో కనప సిద్ధార్థ, అండర్-14లో శివరామ్, అండర్-17 విభాగంలో శషాంక్‌కుమార్, ఆర్చరీ అండర్-17 జానీ ఎంపికయ్యారు. విద్యార్థులను శాలువాలతో సత్కరించి అభినందించారు. వార్డెన్ మల్లయ్య, వ్యాయామ ఉపాధ్యాయుడు సమ్మయ్యతోపాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. తాడ్వాయి మండలలోని ఊరట్టం ఆశ్రమ బాలికల పాఠశాలకు చెందిన విద్యార్థినులు రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికైనట్లు పాఠశాల పీజీ హెచ్ఎం కల్తి శ్రీనివాస్ తెలిపారు. చెస్‌లో కొమరం ప్రశాంతి, ఖో-ఖోలో కొప్పుల ప్రవంతిలు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. విద్యార్థులను, పీడీ లక్ష్మీనారాయణను ఉపాధ్యాయులు అభినందించారు.

వేలిముద్రలు పడక పింఛనుదారుల అవస్థలు

పింఛను కోసం బ్యాంకుకు వచ్చి వెళ్తున్న వృద్ధులు

వాజేడు,నవంబర్ 1 : మండలంలోని పింఛనుదారులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని దూలపురం, చెరుకూరు, నాగారం, జంగాలపల్లి, ధర్మవరం తదితర గ్రామాల నుంచి 20 కిలోమీటర్ల దూరంలోని మండల కేంద్రానికి వచ్చి పింఛన్లు తీసుకుంటున్నారు. ఆయా గ్రామాల్లోని మినీ బ్యాంకుల వద్ద వేలిముద్రలు పడకపోవడంతో వారు వ్యయప్రయాసలకు ఓర్చి 20కిలోమీటర్ల దూరంలో ఉన్న మండలకేంద్రానికి వస్తున్నారు. ఈ సందర్భంగా పింఛనుదారులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పింఛను రూ.4వేలు చేస్తామని మోసం చేసిందని అన్నారు. ఇచ్చిన హామీ మేరకు పింఛన్లు పెంచడంతోపాటు పింఛన్లు తీసుకోవడంలో తమకు ఇబ్బందులు లేకుండా చూడాలని దూలపురం గ్రామనికి చెందిన లబ్ధిదారురాలు కెక్కం సమ్మక్క వాపోయింది.

ఏఐటీయూసీ ఆవిర్భావ వేడుకలు

మొగుళ్లపల్లి, నవంబర్ 1 : మండలంలోని మొట్లపల్లి, మొట్టుపల్లి, ఎల్లారెడ్డిపల్లి, వేముల పల్లి గ్రామాల్లో ఏఐటీయూసీ ఆవిర్భావ వేడుకలను గురువారం నిర్వహించారు. జిల్లా సహాయ కార్యదర్శి గులాం నబి జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి నిమ్మల రాజయ్య, నాయకులు స్వామి, రమేశ్, రాములు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ స్టిక్కరింగ్ వేయాలి

- కలెక్టర్ టీఎస్ దివాకర
- సర్వే పరిశీలన

వెంకటాపురం(నూగూరు):ఎన్యూమరేటర్స్, స్థానికులతో మాట్లాడుతున్న కలెక్టర్ టీఎస్ దివాకర

వెంకటాపురం(నూగూరు), నవంబర్ 1 : ఎన్యూమరేటర్స్ జిల్లాలోని ఒక్క ఇల్లును కూడా వదలకుండా జాబితాను పకడ్బందీగా తయారు చేసి ప్రతి ఇంటికీ వెళ్లి స్టిక్కరింగ్ చేయాలని ములుగు కలెక్టర్ టీఎస్ దివాకర అన్నారు. శుక్రవారం మండలంలోని బొల్లారం, నూగూరు, చొక్కాల గ్రామాల్లో చేపట్టిన ఇంటింటి సర్వే కోసం కుటుంబాల నిర్ధారణను కలెక్టర్ పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ లక్ష్మీరాజయ్య, ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, జీపీ కార్యదర్శి ప్రవీణ్, సెర్ప్ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, జీపీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

సర్వే తీరును పరిశీలించిన అధికారులు

వాజేడు/మంగపేట/ఏటూరునాగారం/ కన్నాయిగూడెం: గ్రామపంచాయతీల్లో శుక్రవారం నుంచి ఎన్యూమరేటర్లు సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ కుల సమగ్ర సర్వేలో భాగంగా కుటుంబాల నిర్ధారణ సర్వే చేపట్టారు. వాజేడు మండలం చంద్రుపట్లలో నిర్వహిస్తున్న సర్వేను ఎంపీవో శ్రీకాంత్‌నాయుడు, గిర్దావర్ కుమారస్వామి పరిశీలించారు. మంగపేటలోని పలు గ్రామాల్లో అడిషనల్ కలెక్టర్ సంపత్ పరిశీలించి అధికారులు, ఎనిమినేటర్లకు పలు సూచనలు చేశారు. కార్యక్రమాల్లో మండల ప్రత్యేక అధికారి తుల రవి, తహసీల్దార్ రవీందర్, ఎంపీడీవో భద్రు, నాయబ్ తహసీల్దార్ మల్లేశ్వర్‌రావు, సూపరింటెండెంట్ సుదర్శన్, ఆర్ఐ శ్రీనివాస్ పాల్గొన్నారు. ఏటూరునాగారం మండలంలోని ముల్లకట్ట గ్రామంలో సర్వేను కలెక్టర్ టీఎస్ దివాకర పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జగదీశ్వర్, ఎంపీడీవో రాజ్యలక్ష్మీ పాల్గొన్నారు. రొ య్యూరు, శంకరాజుపల్లి, ఏటూరునాగారం, రాంపూర్ గ్రామాల్లో చేపట్టిన సర్వేను తహసీల్దార్, ఎంపీడీవోలు పర్యవేక్షించారు. కన్నాయిగూడెం మండలంలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం ఇంటింటి సర్వే నిర్వహించారు. సర్వే తీరును తహసీల్దార్ వేణుగోపాల్, ఎంపీడీవో వనిత, ఎంపీవో సాజిదాబేగం తనిఖీ చేశారు. సర్వేలో ఏపీఎం కమలాకర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పుష్పలత, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

స్వలాభాల కోసమే సింగరేణి గుర్తింపు సంఘం

సింగరేణి కార్మిక సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ రియాజ్ అహ్మద్

కృష్ణ కాలనీ, నవంబర్1: సింగరేణిలో ఇటీవల గెలుపొందిన గుర్తింపు సంఘం ఏఐటీయూసీ, ప్రాతినిధ్య సంఘం ఐఎన్టీయూసీలు కార్మికుల సమస్యలను పక్కనపెట్టి తమ స్వలాభాల కోసమే పనిచేస్తున్నాయని సింగరేణి కార్మిక సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ రియాజ్ అహ్మద్, కో కన్వీనర్ ఐ కృష్ణ, సింగరేణి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కామెర గట్టయ్య ఆరోపించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సింగరేణి ఉద్యోగుల సంఘం కార్యాలయంలో కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కార్మికులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, సింగరేణి ఎన్నికలకు ముందు కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయలేదన్నారు. ప్రధానంగా మందమర్రి, భూపాలపల్లితోపాటు మరికొన్ని ఏరియాల్లో గుడి కమిటీ అకౌంట్‌పై యూనియన్ చందా (కార్మికుల సభ్యత్వం)రికవరీ వెంటనే నిలిపివేయాలన్నారు. కార్మికుల జీతాల నుంచి ఏఐటీయూసీ సభ్యత్వ రుసుము పేరుతో క్రమపద్ధతిలో రికవరీ చేసి ఇస్తున్న అధికారులపై సీరియస్ చర్యలు తీసుకోవాలని సింగరేణి మేనేజింగ్ డైరెక్టర్ బలరాంనాయక్‌ను సింగరేణి కార్మిక సంఘాల ఐక్యవేదిక డిమాండ్ చేస్తున్నదన్నారు. భూపాలపల్లి ఏరియాలో 5,300 పైచిలుకు కార్మికుల ఉండగా 4,600 కార్మికుల సంఖ్య లిస్ట్ తయారు చేసి రికవరీకి సిద్ధంగా ఉందని, తక్షణమే కార్మికుల వేతనాల నుంచి పేమెంట్ రికవరీని ఆపాలని యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. భూపాలపల్లి ఏరియాలో ఏఐటీయూసీ ముఖ్య నేత తొమ్మిదేళ్ల నుంచి నైట్ డ్యూటీ మాత్రమే చేస్తున్నారని, ఇతనికి కొందరు అధికారులు అనుకూలంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఈ విషయాల్లో కార్మిక వర్గం గనులపైన ఆ యూనియన్ నాయకులను నిలదీయాలని, ప్రత్యేక పోరాటాలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. సమావేశంలో వివిధ కార్మిక సంఘాల నాయకులు నీరటి రాజన్న, పోచమల్లు, బత్తిని సుదర్శన్, దాసరి జనార్దన్, కాసర్ల ప్రసాద్ రెడ్డి, పోతుల నరసయ్య, శ్రీధర్, పాల్గొన్నారు.

నేటి అభిప్రాయ సేకరణకు తరలిరావాలి

ములుగురూరల్/కృష్ణ కాలనీ, నవంబర్ 1 : హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో నేడు అన్ని వర్గాల ప్రజల సమగ్ర సమాచార సేకరణపై నిర్వహించే ప్రజాభిప్రాయ సేకరణకు జిల్లాలోని అన్ని కులాలకు చెందిన ప్రతినిధులు హాజరు కావాలని ములుగు కలెక్టర్, జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ టీఎస్ దివాకర శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ వెనుకబడిన తరగతుల కమిషన్ చైర్మన్, సభ్యులు రానున్న